

# పిల్లవాడు తప్పిపోయాడు

[రైలు దిగాక ఎవరో పిల్లవాడు తప్పిపోయాడని జాలిపడ్డ కొండడుకూడ అక్కగార్లతో పేరంటానికి వెళ్తూ తప్పిపోయాడు. ఆ కొండడిని పిల్లలులేని కామేశ్వరశాస్త్రిగారు పెంచుకుందా మనుకున్నారు. కాని...]

రైలు శరవేగంగా పోతోంది. చెవులకు మఫ్లరు చుట్టుకొని సెకండు క్లాసు పెట్టెలో కిటికీ చువ్వలకు ముక్కు ఆనించి, పరుగెత్తె టెలిగ్రాఫ్ స్థంబాలు, చెట్లు చేమలూ చూస్తున్నారు కొండన్న. ఆ అయిదేళ్ళ పసివాడి హృదయంలో టెలిగ్రాఫ్ స్థంబాలు, చెట్లు వెనక్కి పరుగెత్తడం, టెలిగ్రాఫ్ తీగలు రైలుతో సమంగా పరుగెత్తుతూ మధ్య మధ్య స్థంబాలని ముట్టుకోవడానికి దిగుతూ తిరిగి పైకిలేచిపోతూ వుండడం చాలా ఆశ్చర్యంగా వుంది.

బెజవాడలో రైలు ఆగిన అరగంటతర్వాత ఎవరో "రామూ! రామూ!" అని అరుస్తూ కంగారుగా తిరుగుతున్నారు. వాళ్ళలో ఒక ఆవిడ కళ్ళమ్మట నీళ్లు కారుస్తూ వెదుతోంది.

"ఎందుకమ్మా అల్లా పిలుస్తున్నారు?" అని తల్లిని అడిగాడు కొండన్న.

"పాపం! రాము అనే అబ్బాయి రైలు దిగాక తప్పిపోయాడుట! చూసావా? అమ్మా నాన్నా విడిచి దూరంగా వెళ్ళితే పిల్లలు తప్పిపోతారు!" అంది తల్లి.

ఆ రామూ ఎందుకు వెళ్ళాడు? పాపం ఎక్కడ వున్నదో? ఏదో చెప్పలేని భీతావహం వాడి పసిహృదయంలో ఆవహించింది. తనప్రక్కనే కూర్చుని పత్రిక చదువుకొనే తండ్రికి దగ్గరగా జరిగి తగులుతూ కూర్చున్నాడు. పత్రికలోంచి తలపైకితీసి కొడుకును చూసి "పిచ్చి వెధవ!" అనుకుంటూ యింకా దగ్గిరగా తీసికొని తిరిగి తన పత్రికాపఠనంలో మునిగిపోయాడు.

◆ ◆ ◆

కొండన్న తండ్రి యింజనీరు. ఆయన పెద్దకూతురు అత్తవారి వూరు రాజమండ్రి.

రచన:

**కె. వీరభద్రశాస్త్రి, బి. ఏ.,**

ఆవిడను తొలికాన్పుకు పూడిద యిచ్చి తీసికొని రావడానికి వెళ్తున్నారు వాళ్లు. రాజమండ్రి చేరేసరికి రాత్రి ఎనిమిదిన్నర అయింది. ప్లాటుఫారం దాటివస్తూ వుండగా కొండన్న ప్రతిపెట్టెలోకి చూస్తూ వస్తున్నాడు.

"ఎందుకురా ప్రతీపెట్టే చూస్తావు? అని తల్లి విసుగ్గా అడిగింది.

'పాపం! రామూ కనపడతాడేమో అమ్మా!' అన్నాడు కొండన్న.

'పిచ్చి వెధవా! నువ్వు రామూని చూసావా? ఎల్లా తెలుస్తుందిరా నీకు రామూ ఎవరో?' అంది తల్లి.

ఏమిటో?! ఎందుకు తెలియకూడదు?? పాపం ఎక్కడికి పోయాడో??

అక్కగారి యింటికి చేరేసరికి ఆ వాతావరణంలో రామూ విషయం పూర్తిగా మర్చిపోయాడు. పైగా చిన్నక్కకూడా వచ్చింది. అక్కయ్యలిద్దరితో కబుర్లుచెప్పుకోవడంలో కొండన్న హృదయంలోంచి రామూ మాయమైనాడు.

◆ ◆ ◆

మర్నాడు యింట్లో అంతా హడావిడిగా వున్నారు! వంట యింట్లో రకరకాల పిండి వంటలు తయారవుతున్నాయి. చిన్నక్క, పెద్దక్క ఆడబడుచు పేరంటం పిలవడానికి బయల్దేరారు.

'చిన్నక్కా! నేనూ రానద్దూ నీతో?' అని కొండన్న గారంగా అడిగాడు.

'దారిలో నడవలేను, ఎత్తుకోమంటే ఎత్తుకోము! నీ నలుపు మాకు అంటుకొంటుంది?' అంది వేళాకోళంగా పెద్దక్క ఆడబడుచు. 'మరేం ఫరావాలేదు వదినా! వాడి నలుపు అంటుకొన్నంతమాత్రాన నీ రంగు కేం లోపం రాదు?' అని చిన్నక్క నవ్వుతూ సమాధానం చెప్పింది.

వాళ్ళతో వూళ్ళో చాలా యిళ్లు తిరిగాడు కొండన్న. చాలామంది అతనితో వేళాకోళం ఆడారు. మధ్యాహ్నం పదకొండు గంటలయ్యే సరికి పిలవడం పూర్తిచేసుకొని యింటి మొహం పట్టారు. దారిలో ఒక సందుమలుపు తిరుగుతూవుండగా కొండన్న చిన్నక్కకేసి చూసి "చిన్నక్కా" అని ఒక వేలు చూపించాడు.

"ఛా వెధవా! ఇంటికి నడు!" అంది.

'అర్జంటే అక్కా'' అన్నాడు.

'సరే! పోసుకు గబగబా రా! మేం నిమ్మళంగా నడుస్తూ వుంటాం' అంటూ వాళ్లిద్దరూ సందుమలుపు తిర్గి నిమ్మదిగా నడక సాగించారు. కొండన్న ఆ ప్రక్కనే వున్న చెత్తకుండీ దగ్గరకు వెళ్ళి లఘుశంక పూర్తిచేసుకొని గబగబా వస్తూ సందుమలుపు తిరగడం మర్చిపోయి తిన్నగా వెళ్ళిపోయాడు. కొంతదూరం వెళ్లాక వాళ్ళిద్దరూ కనపడకపోయేసరికి దారితప్పినట్లు తెలుసుకొన్నాడు. బిక్కమొంహపెట్టి మళ్ళ వెనక్కి తిరిగిరాబోతూ, సందుచివర ఎవరో యిద్దరు ఆడవాళ్లు వెళ్ళడం కనిపించి గబగబ పరుగెత్తాడు. వాళ్ళు యింకో సందులోకి మళ్లారు. వేగంగా పరుగెత్తి వాళ్ళని కల్సు

కొని 'ఆగవే చిన్నక్కా!' అన్నాడు వగరుస్తూ. వాళ్లు ఆగి వెనక్కి చూసారు. కొండన్న నిర్ఘాంతపోయాడు. వాళ్లు తనవాళ్లు కారు. ఏమీ మాట్లాడకుండా వెనక్కి తిరిగి పరుగు లంకించుకున్నాడు.

రాజమండ్రీలో సందులు ఒక దాంట్లోంచి యింకోటి మెలుచుకువస్తాయి ఆ గజిబిజి కొత్తవారికి ఎవరికైనా కంగారు కలగచేస్తుంది అరగంట గడిచేసరికి కొండన్న అలిసిపోయాడు. మధ్యాహ్నపు సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. వాడి అవస్థ వర్ణనాతీతం! ఏడవడంలేదుగాని, ఎవరైనా పలుకరిస్తే చాలు 'బావు'మని ఏడ్చేటట్లున్నాడు.

ఎదురుగా ఒక ఆయవారం బ్రాహ్మణుడు బుజంమీద మూటతో రాగిచెంబు చేత్తో పుచ్చుకొని ఇంటికిపోతూ కొండన్నను చూసాడు. అతనికి ఏదో అనుమానం వేసింది. 'ఎవరబ్బాయి బాబూ?' అని అడిగాడు.... కొండన్న వెక్కి వెక్కి ఏడ్వడం మొదలు పెట్టాడు. వాడిని వూరడించే సరికి కలప్రాణం తోకకి వచ్చింది. కుర్రవాని వాటం, ముఖ వర్చస్సు చూస్తే బ్రాహ్మణుల అబ్బాయిలాగే వున్నాడు. అయితే ఆసలుపు రంగువల్ల యిది మిద్ధం తేలకుండా వుంది. దగ్గరలోని కాఫీ హోటలుకు తీసికొనివెళ్ళి టిఫిన్ తెప్పించారు. కొండన్న తి లేదు. ఆయన మొహంలోకి చూస్తూ "అమ్మ దగ్గరకు పోతాను. చిన్నక్క కావాలి." అన్నాడు.

◆ ◆ ◆

ఆ బ్రాహ్మణునిపేరు కామేశ్వరశాస్త్రి. అతనికి పిల్లలులేరు. ఆయవారంవృత్తితో జీవిస్తున్నాడు. ఆ వృత్తిలోని రాబడితోనే ఒక నాల్గు వేలదాకా వడ్డీకి తిప్పుతున్నాడు. భార్య మాణిక్యమ్మకు పిల్లలంటె ఎంతో యిష్టం. అయితే దైవం అనుకూలించలేదు. కాపురానికి వచ్చి పదేళ్ళు అయినా పిల్లలు కల్గకపోవడంతో ఆవిడకు ఒక రకమైన మనోవ్యాధిలా అంకురించి చివరకు హిస్టీరియాలోకి దింపింది. కామేశ్వరశాస్త్రి వైద్యలోపం లేకుండా చేయిస్తున్నారు. అయితే యిది మనోవ్యాధి కదా! ఏ పిల్లవాడినైనా దత్తత చేసికొంటె యీవిడ వ్యాధి తగ్గవచ్చునని వైద్యుడు సలహా యిచ్చాడు. కాని, అతనివృత్తినిచూసి ఎవరూ మనఃపూర్వకంగా దత్తత యివ్వలేకపోతున్నారు. అందుచేత నాటికీ నేటికీ ఆ సమస్య తీరనిదే అయి కామేశ్వరశాస్త్రిని మనస్సులో కృంగతీస్తోంది కొండన్న దొరకడంతో అతనికి ఏదో ఆధారం దొరికినట్లుగా అనిపించింది ఈ పిల్లవాడు బ్రాహ్మణ పిల్లవాడైతే బాగుండును అని అతనికి అ పించింది.

కామేశ్వరశాస్త్రి యింట్లో హాలులో కొండన్నకు విస్తరినిండా అన్నం, యితర పదార్థాలు వడ్డించి ఎదురుగా పెట్టారు ఆ విస్తరిని కొండన్న ముట్టుకోలేదు. దంపతులిద్దరూ చాలాసేపు బుజ్జగించి బ్రతిమాలారు. అయినా లాభంలేకపోయింది. వాడివరస చూస్తే తల్లితండ్రుల దగ్గరకు వాడిని చేర్చక పోతే నిరాహారదీక్ష పూనేటట్లున్నాడు. కామేశ్వరశాస్త్రికి భయంపట్టుకొంది. చివరకు ఆరాతీయడం ప్రారంభించారు.

'నీ పేరేమిటి బాబూ!'

'కొండన్న' అన్నాడు ఎక్కుగా

'ఎవరి అబ్బాయివి నాయనా!'

'దొరగారి అబ్బాయిని'

కామేశ్వరశాస్త్రికి అనుమానం వేసింది ఒకవేళ వెలమదొరల పిల్లవాడేమోనని.

'మీ నాన్నగారి పేరేమిటి?'

'దొరగారు!'

'కొండన్న తండ్రి యింజనీరు. ఆయన యిప్పుడు వుండే గ్రామంలో వాళ్లు

'దొరగారు' అనిపిస్తారు. తండ్రి పేరు కొండన్నకికూడా తెలియదు.

'మీ అమ్మ పేరేమిటి?'

'అమ్మ!' ఇంతలో తల్లి జ్ఞాపకం రావడంతో మళ్లీ ఏడ్పు మొదలు పెట్టాడు. మళ్లీ వాడిని సముదాయించారు.

'ఈ వూళ్ళో ఎవరింటికి వచ్చావు?

'మా పెద్దక్కగారింటికి' అన్నాడు కొండన్న ఈ వివరాలు అడగడం తీరు వాడికి ఏదో వూరట కల్గించి కొంచెం ఆశగా కామేశ్వరశాస్త్రికేసి చూసాడు.

'మంచినీళ్లు కావాలి!' అన్నాడు

మాణిక్యమ్మ గ్లాసుతోనీళ్ళు తెచ్చి చేతికి యివ్వకుండా ప్రక్కనే పెట్టింది. కొండన్న మంచినీళ్లు తాగాడు.

"మీరు ఏంకూరలు తింటారు బాబూ"అని అడిగింది మాణిక్యమ్మ బ్రాహ్మణుడో కాదో తెలుసుకొందామని.

"వంకాయ, బీరకాయ, ఆనపకాయ యింకా కాకరకాయ తింటాము. మా అమ్మ పొట్లకాయ పప్పు వేస్తుంది... మా బామ్మ పొట్లకాయ పెరుగుపచ్చడి చేస్తుంది...' అని ఉత్సాహంగా చెప్పాడు కొండన్న.

అయితే బ్రాహ్మణ కుర్రవాడే! ఫరవాలేదు...ఆ దంపతుల మనస్సులో ఏదో ఆశ మెదిలింది. పోనీ యీ కుర్రవాణ్ణి పెంచుకుంటే! మాణిక్యమ్మ పిల్లవానికేసి ఆశగా చూస్తూ కూర్చుంది. ఆవిడ తీరు చూసి కామేశ్వరశాస్త్రికి జాలివేసింది. కుర్రవాడు బ్రాహ్మణుడే అని ధృవపడుతున్నా అతను చివరిసారిగా యింకోసారి ప్రయత్నం చేసారు.

'మీరు మాంసం తింటారా?' అని అడిగాడు కామేశ్వరశాస్త్రి.

'ఛా! తినం'

'అయితే మాంసం, చేపలు తినరన్నమాట' అంది మాణిక్యమ్మ తేలికఅయిన హృదయంతో.

'చేపలు కాల్చి తింటాము... మా అమ్మ చేపలు కాల్చేది....' అన్నాడు కొండన్న.

'చచ్చాం!! ఇదేమిటి!' ఆ మాట వినగానే ఆ దంపతులిద్దరూ కొంచెందూరంగా జరిగారు. వాళ్లకి మతులుపోయాయి. వంటలు చూస్తే బ్రాహ్మణవంటలు... మరి యీ చేపలు కాల్చుకోవడం ఏమిటి? వారి అనుమానం వదలకుండానే

'అదిగో చిన్నక్క!' అంటూ కొండన్న గుమ్మందగ్గరకు పరుగెత్తికివెళ్లి ఎదురుగావస్తున్న చిన్నక్క కాళ్లకు వాటేసుకొన్నాను.

'ఓరి వెధవా? నీ కోసం తిరగలేకచచ్చాం! అప్పటికివెళ్లి మా వెనకాల రాక ఎల్లాపోయావ్?' అంది చిన్నక్క.

(తరువాయి 20 వ పేజి)

## పిల్లవాడు తప్పిపోయాడు

(10 వ పేజి తరువాయి)

'మా ప్రాణాలు తీసావు కదయ్యా బావా!' అంటూ వదిన లోపలికి వచ్చింది. ఆవిడను చూచి కామేశ్వరశాస్త్రి లేచి నిల్చుని 'మీ అబ్బాయిటండీ?' అని అడిగాడు

లఘు శంకకు వెళ్లినవాడు ఎంతకీ రాకపోయేసరికి కంగారుపడి వాళ్లిద్దరూ వెనక్కి తిరిగికొండన్న సహాయంతో వెతుక్కుంటూ వాకబు చేస్తు తిరిగారు. చివరికి ఎవరో ఫలానా ఆయవారం బ్రాహ్మణుడితో ఒకసన్నటిఅబ్బాయి ఏడుస్తూ వెళుతున్నాడని, కాఫీ హోటలు లోకి వెళ్లారని చెప్పాడు. ఆ హోటలుకు వెళ్లి వాకబుచేసి చివరకు యిక్కడకు చేరారు.

వాళ్లుపడ్డ అవస్థకు దంపతులు చాలా బాధ పడ్డారు. 'ఏం పెట్టినా తినలేదండి! అమ్మ! చిన్నక్క అంటూ ఒకటే ఏడ్పు' అంది మాణిక్యమ్మ.

"వస్తామండీ" అంటూ బయల్దేరారు వాళ్లు.

అయితే కామేశ్వరశాస్త్రి అనుమానం తీరలేదు.

'ఏమండమ్మా! మీ వాడు చేపలు కాల్చి తింటామని అంటాడు....' అని సగంలో

ఆ మాటలనగానే వాళ్ళిద్దరూ ఫక్కున నవ్వారు. 'అవి వేరుశనగకాయలు... అవి తింటే పైత్యంచి వాంతులు వెళ్తాయని మా బామ్మగారు వాటిని తినకూడదు, అవి చేపలు అని అంటూ వుండేది. అయితే యిప్పుడు మానాన్నగారు పనిచేసేచోట వేరుశనగ పంట ఎక్కువ. అందుచేత మా అమ్మ మధ్యాహ్నం వేళ పని లేక శనగకాయలు కొల్చి పెట్టుంది. వాటి పేరు చేపలు అనేగాని వేరుశనగకాయలని మాకొండన్నకు తెలియదు' అంది చిన్నక్క నవ్వుతూ...

ఆ మాటకు తెల్లబోయి నిలబడిపోయారు ఆ దంపతులిద్దరూ...

★

## 'ఎంత దారుణం జరిగిందీ వానరాత్రి!!!'

(మాచెర్ల వార్త విన్నతరువాత)

ఈవానరాత్రి విషాదంగా
క్రక్కిన నెత్తురు మడుగునుచూస్తూ
ఈ భయంకర కాళరాత్రిని
గడపటానికి ప్రయత్నిస్తూ
క్షణాలు నిమిషాలు
లెక్కవేసుకొంటున్నాను!
నరజాతి పరజాతి అని భేదంలేక
గుట్టలు గుట్టలుగా పడివున్న
శవాల మధ్య నుంచొని
యోచిస్తున్నా!
ఏ మమతలు ఏ సమతలు
అడ్డురాని యీ బీభత్సం-
ఏ మారణోత్సవానికి దారో
అర్థంకావడం లేదు!
మనిషిని మనిషి హత్యచెయ్యలేదు
న్యాయం గొంతు అన్యాయం
నొక్కలేదు!
తిండి గింజలుకొరకు క్యూలో
నిల్చున్న
మనిషి నిలువలేక కూలి పోలేదు!
కూలి దొరక ఎవరూ జాలిదలచక
సంసార సాగరాన్ని ఈదలేక
కుటుంబం మొత్తం విషం
మింగలేదు!
కారడవిని కాల్చివేసిన
దావాగ్నివలె
ఈ వానరాత్రి యేరులు పొంగి
ప్రాణాలు ప్రమింగి
భయంకర భీభత్స మానవ
మారణ దారుణ
భయోజ్వల భీకర నృత్యం
సలుపుతుంది!
ఒక్క మనిషికూడ 'ఇదిఅన్యాయం'
అని అరవలేకపోయాడు!
ఒక్క పశువుకూడ ఇది!!
మహా ఘోరం'
అని విడమర్చి చెప్పలేకపోయింది!
కాల నాగు కరాళ నృత్యంలో
కాలసర్పం కాటేసిన సత్యంలో
ఈవానరాత్రి ఎందరు జనులు
దీనులు, హీనులు బలైపోయారు!
లెక్కవేసేందు కెవరూ
సాహసించలేదు!
'అబ్బా! ఈ దారుణ మారణ
హోమం
తలచుకొంటే గుండెలు మండి
రక్తాన్ని చిందిస్తున్నాయి!
కలం కదలడంలేదు...
కవితనల్లడం లేదు!...
ఎంత దారుణం జరిగిందీ
వానరాత్రి!!"..."

—"శ్రీ వాణి"